సాక్షి
వైఎస్సార్ జిల్లా


గురువారం । 14 । నవంబర్ । 2024



ఒకటే గమ్యం.. ఒకటే లక్ష్యం... సైన్యంలో కొలువు సాధించడమే ధ్యేయంగా అభ్యర్థులు పరుగు సాగించారు. కడప నగరంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఎంపికల ప్రక్రియకు వర్షం స్వల్ప అంతరాయాన్ని కలిగించింది. కడప డీఎస్ఏ స్టేడియంలో అభ్యర్థులకు నిర్వహించాల్సిన 1.6 కి.మీ పరుగు పందెంను వర్షం కారణంగా నగరంలోని మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్ రహదారిలో నిర్వహించారు. -కడప స్పోర్ట్స్

న్యూస్‌రీల్

రేపు ప్రత్యేక బస్సు సర్వీసు



కడప కోటిరెడ్డి సర్కిల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పుష్పగిరి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి తెలిపారు. ఉదయం 6, 7 గంటలకు కడప నుంచి బస్సులు బయలుదేరుతా యని పేర్కొన్నారు. మైదుకూరు నుంచి కూడా ఉదయం 6, 7 గంటలకు సర్వీసులు నడుస్తా యని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ విజిలెన్స్ సీఐగా నరసింహారెడ్డి



కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీఎస్‌పీడీసీఎల్) విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరసింహారెడ్డి నియమితులయ్యారు. విద్యుత్ భవన్‌లోని విజిలెన్స్ కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన దారెడ్డి భాస్కర్‌రెడ్డి బదిలీ అయిన తర్వాత ఈ పోస్టు ఖాళీగా ఉంది. నరసింహారెడ్డి గతంలో ప్రొద్దుటూరు టూటౌన్, కడప చిన్నచౌకు పోలీస్ స్టేషన్లలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

జిల్లాలో జోరు వర్షం



కడప అగ్రికల్చర్: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో ప్రస్తుతం సాగు చేసిన సాగులో ఉన్న ఆరుతడి పంటలకు మేలు జరగనుంది. అక్కడక్కడ ముందుగా సాగు చేసిన వరి రైతుల్లో మాత్రం ఆందోళన నెలకొంది. ఈ వర్షంతోపాటు గాలులు వీస్తే కొతకు వచ్చిన వరిపంట నేలకొరుగుతుందేమోనని కలవరం మొదలైంది. దీంతోపాటు ప్రస్తుతం కురిసిన వర్షాలకు జిల్లాలో అక్కడక్కడ శనగ, మినుము, పెసర, నువ్వు పంటలను సాగు చేసుకునేందుకు సాగుకూలంగా కూడా ఉంటుందని పలువురు రైతులు తెలిపారు. మంగళవారం పొద్దుపోయాక వర్షం పడటం ప్రారంభించింది. దీంతో జిల్లాలోని 9 మండలాలు మినహా మిగతా మండలాలన్నింటిలో కొద్దో గొప్పో వర్షం కురిసింది. జిల్లాలోని ఒంటిమిట్టలో అత్యధికంగా 41.2 మి.మీ వర్షం కురవగా అత్యల్పంగా సింహాద్రిపురంలో 0.6 మి.మీ నమోదయింది.

భద్రతా ప్రమాణాలతో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు

కడప సెవెన్‌రోడ్స్ : పర్యావరణానికి ఎలాంటి అంతరాయం లేకుండా, నిబంధనలకు లోబడి కడప ఎయిర్ పోర్ట్ నూతన భవన నిర్మాణ పనులను చేపట్టేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఏరోడ్రమ్ కమిటీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులు, నిర్మాణ ఏజెన్సీలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ అదితిసింగ్‌తో కలిసి కడప ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి దీటుగా నూతన టెర్మినల్ భవన నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, విమానాశ్రయం డైరెక్టర్, కమిటీ కన్వీనర్ సుజిత్ కుమార్ పోదర్, ప్రాజెక్టు ఇంచార్జి రాజేష్, కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీలు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల ధీరులు!



అల్లరి చేయాల్సిన బాల్యంలో అలలై ఎగిసిపడుతున్నారు.. సెల్లుల వలలో చిక్కుకుపోకుండా కలల్ని సాకారం చేసుకునే దిశగా అడుగులేస్తున్నారు.. ఆటలాడుతూ పతకాల వేట సాగిస్తున్నారు. 'చేతి గీత'లతో తమ రాతను కొత్తగా రాస్తున్నారు. మేం పిల్లలం కాదు... చిచ్చర పిడుగులం.. భావిభారత ఆశాకిరణాలం అంటూ ఎలుగెత్తి చాటుతున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న బాలలపై ప్రత్యేక కథనం.

రైఫిల్ షూటింగ్‌లో ఉబైద్ ప్రతిభ



ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు పట్టణంలోని గ్రీన్‌వ్యాలీ అపార్ట్‌మెంట్‌కు చెందిన షేక్ జాకీర్‌హుస్సేన్ (ల్యాబ్‌టెక్నీషియన్), అప్సానా భాను మొదటి కుమారుడు మహ్మద్ ఉబైద్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో రైఫిల్ షూటింగ్ శిక్షకుడు రాఘవ వద్ద శిక్షణ పొందుతూ పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ సత్తాచాటి 9 బంగారు పతకాలు సాధించడంతో పాటు 2 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2022లో హైదరాబాదులో రైఫిల్‌షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్‌లెవల్ పోటీల్లో ఓపన్ సైట్ సబ్‌యూత్, యూత్ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించారు. 2022లో రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఓపన్‌సైట్ అండర్ -19 విభాగంలో బంగారు పతకం సాధించాడు. 2024లో హైదరాబాద్‌లో రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపన్ సైట్ కేటగిరి సబ్‌యూత్, యూత్, జూనియర్ మెన్, మెన్ విభాగంలో 4 బంగారు పతకాలు సాధించడం విశేషం. త్వరలో భోపాల్‌లో జరుగనున్న జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు.



మైదుకూరు: వ్యాయామ ఉపాధ్యాయినులతో నవీన్, రోహన్, మహ్మద్ రఫీ

భావి ఫుట్‌బాల్ ప్లేయర్లు వీరు..

మైదుకూరు: మైదుకూరు బాయ్స్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించే ఫుట్‌బాల్ ప్లేయర్లుగా ఎదుగుతున్నారు. మైదుకూరు హైస్కూల్‌లో పదో తరగతి చదివే మహమ్మద్ రఫీ అండర్-19, రోహన్ అండర్-17, ఏడో తరగతి చదివే నవీన్ అండర్-14 కేటగిరిల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. మైదుకూరు పట్టణానికి చెందిన మహమ్మద్ రఫీ తండ్రి నాయబ్ రసూల్ కూల్ డ్రింక్ షాప్ నడుపుతున్నాడు. వనిపెంటకు చెందిన రోహన్ తండ్రి రమేష్ కుమార్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మైదుకూరుకు చెందిన నవీన్ తండ్రి గురవయ్య కూలి పనులు చేస్తాడు. పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయినులు వినోనియా రాణి, చంద్రావతి ప్రోత్సాహంతో త్వరలో సత్తెనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మహమ్మద్ రఫీ పాల్గొనబోతున్నాడు. ఇతను జూడో ఆటలో కూడా ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం విశేషం.

చిత్రకళలో రాణిస్తున్న నాగేంద్ర



తాను గీసిన భరత మాత చిత్రపటంతో నాగేంద్ర

మైదుకూరు: మైదుకూరు బాలుర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన తాటి నాగేంద్ర చిత్రకారుడిగా రాణిస్తున్నాడు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి ఎవరి వద్ద శిక్షణ పొందకుండానే స్వతహాగా చిత్రాలు గీస్తుండడం విశేషం. ఇటీవల కడపలో జరిగిన బాలోత్సవాల్లో ఈ విద్యార్థి తన చిత్రాలను ప్రదర్శించాడు. నాగేంద్ర తండ్రి సుబ్బరామయ్య లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొద్ది రోజుల కిందట అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కూడా నాగేంద్ర పాల్గొన్నాడు. భవిష్యత్తులో మంచి చిత్రకారుడిగా పేరు పొందాలనేది తన కోరికని నాగేంద్ర పేర్కొన్నాడు.

జిరాఫీ చెస్‌లో దిట్ట సుజన్



జిరాఫీ చెస్ ఆడుతున్న సుజన్

ప్రొద్దుటూరు కల్చరల్: జిరాఫీ చెస్ ఆటలో సుజన్ కుమార్ రెడ్డి తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని ఆటలో రాణిస్తున్నాడు. దొరసానిపల్లెకు చెందిన పెద్దిరెడ్డి సునీల్‌కుమార్‌రెడ్డి, వసుంధరల కుమారుడు సుజన్‌కుమార్‌రెడ్డి ఐదేళ్లుగా వివిధ రకాల జిరాఫీ చెస్ పోటీల్లో పాల్గొని రాణించి అందరి ప్రశంసలు పొందుతున్నాడు. అంతర్జాతీయ జిరాఫీ చెస్ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిరాఫీ చెస్ పోటీల్లో ప్రావీణ్యం సాధించాడు. ప్రతి ఆదివారం నిర్వహించే జిరాఫీ చెస్ పోటీల్లో పాల్గొని 320 ఆటలు ఆడి 214 సార్లు గెలిచి ప్రతిష్టాత్మకంగా బెస్ట్ స్కాలర్ బిరుదు అందుకున్నాడు. 2024 జనవరిలో నిర్వహించిన అండర్-19బాలుర డబుల్స్ పోటీల్లో రన్నర్‌గా నిలిచాడు. ఏప్రిల్‌లో నిర్వహించిన అండర్-13 బాలుర సింగిల్స్ పోటీల్లో రన్నర్‌గా, మేలో నిర్వహించిన అండర్-11 బాలుర సింగిల్స్, డబుల్స్ పోటీల్లో విజేతగా నిలిచి డాక్టర్ ప్రతాపరెడ్డి, డాక్టర్ పద్మజా ద్వారా ట్రోఫీ, ప్రశంసలు అందుకున్నాడు. జిరాఫీ చెస్ హ్యాట్రిక్ లీగ్‌లో ప్రొద్దుటూరు పాంథర్స్ జట్టు తరపున ఆడి కేవలం 156 ఎత్తుల్లో ప్రొద్దుటూరు జాగ్వర్స్ జట్టులోని ముగ్గురు ఆటగాళ్లను అవుట్ చేసి తొలి హ్యాట్రిక్ సాధించి హ్యాట్రిక్ హీరో బిరుదు అందుకున్నాడు. కాగా సుజన్‌కుమార్‌రెడ్డి 5వ తరగతి చదువుతున్నాడు.

అక్కా తమ్ముళ్లు చిచ్చర పిడుగులు

● ప్రొద్దుటూరు చిన్నారుల ప్రతిభ



తాను సాధించిన రికార్డులతో బాలిక వినీశ

ప్రొద్దుటూరు: అక్కా తమ్ముళ్లు తమ జ్ఞాపకశక్తితో పతకాల పంట పండిస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పవన్, సౌమ్యల దంపతుల కుమార్తె వినీశ, కుమారుడు ప్రజ్వల్ చిన్న వయసులోనే ప్రతిభచాటుతున్నారు. విశ్వనాథుల వినీశ (4) చిన్నారి ప్రస్తుతం యూకేజీ చదువుతోంది. చిన్న వయసులోనే ఆ బాలిక జాతీయ చిహ్నాలు, ట్రాఫిక్ సిగ్నళ్ల రంగాలు, పక్షులు, పండ్లు, కూరగాయలను గుర్తుపట్టడం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచపటంలోని వివిధ దేశాలు, నగరలను అత్యంత సులువుగా చెప్పేస్తోంది. పిరియాడిక్ టేబుల్‌లోని 118 సైన్స్ ఎలిమెంట్స్‌ను కేవలం 52 సెకన్లలోనే చెప్పే నైపుణ్యం సాధించింది. చిన్నారి ప్రతిభను గుర్తించి ఇండియా బుక్ ఆఫ్‌రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్‌రికార్డ్స్, కలాం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నోబెల్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి చిన్నారి అవార్డులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

అదే బాటలో తమ్ముడు.. వినీశ సోదరుడు ప్రజ్వల్‌కు ప్రస్తుతం ఏడాది వయసు. బాలుడు వివిధ రకాల పండ్లు, పక్షులు, అంకెలు, కూరగాయల చిత్రాలను చూసి గుర్తించేలా తల్లిదండ్రులు సాధన చేయించారు. ప్రజ్వల్ ప్రతిభను గుర్తించిన నోబెల్ వరల్డ్ రికార్డ్స్ వరకు ప్రశంసాపత్రం అందించారు. ఈ చిన్నారుల ప్రతిభకు అందరూ ఔరా.. అంటూ ఆశ్చర్యపోతున్నారు.



నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌తో చిన్నారి ప్రజ్వల్

ఇసుక తవ్వితే మా పరిస్థితేంటి.?

టిప్పర్లను అడ్డుకున్న రైతులు

చక్రాయపేట : పాపాఘ్ని నదిలో అక్రమంగా ఇసుక తోడుకునేందుకు వచ్చిన టిప్పర్లను కుమార్లకాల్వ గ్రామ రైతులు అడ్డుకున్నారు. మీ ఇష్టం వచ్చినట్లు ఇసుక తవ్వితే భూగర్భ జలాలు అడుగంటి ఫిల్టర్లు ఎండిపోతే మా పరిస్థితి ఏంటి, మేమంతా పంటలు ఎండబెట్టుకోవాల్సిందేనా అంటూ మండిపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయకుమారి, ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్యలు సంఘటన స్థలానికి వెళ్లి రైతులకు సర్దిచెప్పి టిప్పర్లను పంపించి వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మారెళ్లమడక వద్ద ప్రభుత్వం ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చిందని చెప్పి కొందరు నదిలో రోడ్డు వేసి హిటాచీలతో ఇసుకను టిప్పర్లకు నింపి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ఇసుక రీచ్‌కు సంబంధించి మండల అధికారులకు ఎలాంటి సమాచారం లేదు. మారెళ్లమడక వద్ద ఇసుక రీచ్‌కు అనుమతి ఇస్తే కుమార్లకాల్వ వద్ద ఎలా తవ్వుతారని రైతులు నిలదీశారు. దీంతో అధికారులు జోక్యం చేసుకోవడంతో హిటాచీలు, టిప్పర్లను అక్కడి నుంచి తరలించారు. ఇసుక రీచ్‌పై తహసీల్దార్ విజయకుమారి మాత్రం తాను మైనింగ్ అధికారులతో మాట్లాడానని ఇందుకు సంబంధించి అగ్రిమెంట్లు పూర్తయినట్లు చెప్పారని ఆమె వివరించారు.



ఇసుకను తవ్వొద్దంటూ దారికి అడ్డంగా నిలబడిన కుమార్లకాల్వ రైతులు

కడప రిమ్స్‌లో వర్రా రవీంద్రారెడ్డికి వైద్య పరీక్షలు

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డికి మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వైద్య పరీక్షలను నిర్వహించారు. వర్రా రవీంద్రారెడ్డి మెజిస్ట్రేట్‌కు ఇచ్చిన వాంగ్మూలాన్ని స్టేట్‌మెంట్‌గా రికార్డు చేశారు. తనపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేశారని రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఆదేశాలతో స్పెషల్ పార్టీ పోలీసులు వర్రా రవీంద్రారెడ్డిని భారీ బందోబస్తు మధ్య రిమ్స్ క్యాజువాలిటీకి తీసుకుని వచ్చారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వైద్యులచే పరీక్షలు నిర్వహించారు. తరువాత రాత్రి 7గంటలకు కడప కేంద్రకారాగారానికి పోలీసులు తీసుకుని వెళ్లారు.



వర్రా రవీంద్రారెడ్డిని కడప రిమ్స్ నుంచి తీసుకుని వెళ్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు

'సవేరా' వెంకటయ్య కన్నుమూత



సవేరా వెంకటయ్య (ఫైల్)

కడప కల్చరల్ : రాష్ట్రంలోనే సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు, దర్శకునిగా పేరుగాంచిన కడప నగరానికి చెందిన ఆళ్లూరి వెంకటయ్య (91) మంగళవారం రాత్రి 9.30 గంటలకు కన్నుమూశారు. కడప నగరం ఎన్జీఓ కాలనీలోని తన స్వగృహంలో ఆయన మరణించారు. వెంకటయ్య సవేరా ఆర్ట్స్ పేరిట రంగస్థల సంస్థను స్థాపించి రాష్ట్రంలోనే ఉత్తమమైన కళా సంస్థగా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. సురభి నాటక సంస్థ పుట్టిన మన జిల్లాలో ఆ తర్వాత రంగ స్థల విభాగంలో సవేరా సంస్థను గొప్పగా తీర్చిదిద్దారు. పౌరాణిక నాటకాలలో అత్యంత క్లాసిక్‌గా రామాయణాన్ని ఐదు భాగాలుగా ప్రదర్శించి తనదైన శైలిని, రామాయణంపై తనకుగల మక్కువను చాటుకున్నారు. కడప, ప్రొద్దుటూరులతోపాటు కర్ణాటక, ఉత్తర భారతదేశంలోని పలు నగరాలలో ఐదు భాగాల రామాయణాన్ని వ్యయ ప్రయాసల కోర్చి సినిమాకు దీటైన సెట్టింగులు తదితర హంగులతో ప్రదర్శించి సవేరా వెంకటయ్యగా పేరు తెచ్చుకున్నారు. వ్యక్తిగతంగా 8 నంది అవార్డులతో కలిపి సంస్థ నాటకాలకు 28 నంది బహుమతులు సాధించి పెట్టారు. ఆయన మృతికి జిల్లా కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

వేముల/వీరపునాయునిపల్లె/ పులివెందుల రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ సాగులో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా వేముల మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో, వీరపునాయునిపల్లె మండలంలోని మర్రిపల్లె గ్రామంలో సాగులో ఉన్న చామంతి, అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా, మార్కెటింగ్ ఉండే విధంగా ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలో రైతులందరినీ ఒక గ్రూపుగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కోల్డ్ స్టోరేజ్‌లను, ప్యాక్ హౌస్‌లను నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ జెడీ నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సుభాషిణి, ఎంపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, అధికారులు చెన్నారెడ్డి, రాఘవేంద్రా రెడ్డి, భానుశ్రీ, ఏడీఏ నరసింహారెడ్డి, లక్ష్మీదేవి, రఘునాథ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



కొత్తపల్లె వద్ద చామంతి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేడీఏ, తదితరులు

- చామంతి, అరటి పంటల సాగు చేసే విధానాన్ని, ధరల తీరును కలెక్టర్ ఆరా తీశారు. దళారుల ప్రమేయంతో నష్టపోతున్నామని రైతులు వివరించారు.
- బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని అరటి శీతల గిడ్డంగి, అరటి ప్రాసెసింగ్ యూనిట్‌లను కలెక్టర్ పరిశీలించారు. పులివెందుల మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, గంగాధర్ రెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేయడంలో మరింత కృషి చేయాలని జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సభ్యులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ అదితి సింగ్ హాజరై జిల్లా సహకార అభివృద్ధిపై సమీక్షించారు. జిల్లాలో డీసీసీబీ అనుబంధంగా నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు తదితర అంశాలపై చర్చించి పలు సూచనలిచ్చారు.

సహకార వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి

జిల్లాలో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని కలెక్టర్ గారి ఛాంబర్ లో 71వ అఖిలభారత సహకార వారోత్సవాలు'వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఘనంగా బ్రహ్మంగారి జయంతి ఉత్సవాలు

- 416 కలశాలతో మహిళల ఊరేగింపు
- మహానంది నుంచి స్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు
- కనుల పండువగా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి కుమారులు



పురవీధులలో కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి 416వ జయంతి ఉత్సవాలు రెండవ రోజైన బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ పర్యవేక్షణలో మఠం మేనేజర్ ఈశ్వరాచారి ఆధ్వర్యంలో స్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు 416 కలశాలతో దేవస్థానం నుంచి పురవీధుల ద్వారా మహిళలు భారీ ఊరేగింపుగా సమీపంలో ఉన్న స్వామి విగ్రహం వద్దకు చేరుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు విగ్రహం దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పూర్వపు మఠాధిపతి కుమారులు కలశాలలోని క్షీరంతో విగ్రహానికి శుద్ధి చేశారు. స్వామి కల్యాణానికి మహానంది నుంచి అక్కడి దేవస్థానం ఈఓ పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఇచ్చారు. ఈమేరకు బుధవారం రాత్రి జరిగిన స్వామి కల్యాణానికి మహానంది దేవాలయం నుంచి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు ఈఓ కాలువ శ్రీనివాసులరెడ్డి అందించారు. వేదపండితులు , పూర్వపు మఠాధిపతి పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి, రెండవ కుమారుడు భద్రయ్య స్వామి, మూడవ కుమారుడు వీరభొట్లయ్య స్వామి, నాలుగో కుమారుడు దత్తస్వామి సతీసమేతంగా పాల్గొన్నారు. అలాగే రెండవ భార్య కుమారులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం హరికథ ఏర్పాటు చేశారు.

